సాక్షి
తూర్పుగోదావరి
సోమవారం । 25 । సెప్టెంబర్ । 2023



రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో నిత్యాన్నదాన పథకానికి పాలచర్ల సూర్యారావు దంపతులు (మండపేట) ఆదివారం రూ.లక్ష విరాళం సమర్పించారు.



...ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సు

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎమ్మెస్సీలో ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సుకు శ్రీకారం చుట్టింది. ఆ వివరాలు..

- 8లో

కడలిలోకి 3.22 లక్షల క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం 3,22,665 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 4,700, మధ్య డెల్టాకు వెయ్యి, పశ్చిమ డెల్టాకు 7 వేల క్యూసెక్కుల చొప్పున మొత్తం 12,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.20 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

రేపు జాతీయ లైవ్ స్టాక్ మిషన్ అవగాహన సదస్సు



జేసీ తేజ్‌భరత్

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక శ్రీ వేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో మంగళవారం జాతీయ లైవ్ స్టాక్ మిషన్ జిల్లా స్థాయి అవగాహన సదస్సు నిర్వహిస్తున్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ ఆదివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. గ్రామీణ స్థాయిలో పశు పోషణ ద్వారా ఆర్థిక పురోగతి సాధించుకొనేలా ఔత్సాహిక రైతులను, నిరుద్యోగులను ప్రోత్సహించేందుకు పశు సంవర్ధక శాఖ జాతీయ లైవ్‌స్టాక్ మిషన్ నిధులతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వివరించారు. సదస్సులో ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, సభ్యులు, మండల, రైతుభరోసా కేంద్రాల స్థాయిల్లోని వ్యవసాయ సలహా మండళ్ల అధ్యక్షులు, గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘాల అధ్యక్షులు, 400 మంది ఔత్సాహిక, అభ్యుదయ రైతులు పాల్గొంటారని జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ ఎస్‌టీజీ సత్యగోవింద్ తెలిపారు.

కోటసత్తెమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు విశేషంగా తరలివచ్చి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు తీర్చుకున్నారు. ప్రధానార్చకుడు అప్పారావు శర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోల అమ్మకం ద్వారా అమ్మవారికి రూ.1,29,264 ఆదాయం సమకూరిందని ఈఓ బళ్ల నీలకంఠం (శివ) తెలిపారు.

ఫోల్డర్లు, బ్యాగుల సరఫరాకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష (జేఏఎస్) కార్యక్రమానికి సంబంధించిన ఫోల్డర్లు, బ్యాగులు సరఫరా చేయడానికి ఆసక్తి ఉన్న ఏజెన్సీలు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వేంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జేఏఎస్ ఆరోగ్య శిబిరాలకు వచ్చి, వైద్య సేవలు పొందే ప్రజలకు కేస్‌షీట్, ఫోల్డర్, బ్యాగ్ అందించాల్సిందిగా జాయింట్ కలెక్టర్ కోరారన్నారు. ఆ మేరకు లక్ష చొప్పున రెండు రకాల ఫోల్డర్లు, బ్యాగులు సరఫరా చేయాలని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు జేఏఎస్ నోడల్ అధికారిని 8143 119 111 నంబరులో సంప్రదించాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులను సోమవారం ఉదయం 10 నుంచి మంగళవారం సాయంత్రం 5 గంటల వరకూ స్వీకరిస్తామని తెలిపారు. వివరాలకు https://eastgodavari.ap.gov.in వెబ్‌సైట్ కూడా చూడవచ్చని డీఎంహెచ్‌ఓ తెలిపారు.

పుష్కర-2 నుంచి నీటి విడుదల నిలిపివేత

సీతానగరం: పురుషోత్తపట్నంలోని తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకం-2 నుంచి సాగునీటి విడుదల నిలిపివేశారు. జలవనరుల శాఖ డీఈ వెంకట్రావు ఆదివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. పుష్కర-2 పథకానికి విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం కలిగింది. దీంతో పైప్‌లైన్ నుంచి లీకేజీ సమస్య ఏర్పడింది. ఆ లీకేజీ ఎక్కడ ఏర్పడిందో తెలుసుకోవడానికి అవసరమైన యంత్రాన్ని తీసుకువస్తున్నామని, ఈ సమస్యను మూడు రోజుల్లో పరిష్కరిస్తామని వెంకట్రావు తెలిపారు. మెట్ట ప్రాంత పంట పొలాలకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా పుష్కర-1 నుంచి మూడు మోటార్ల ద్వారా 525 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేశామని వివరించారు. పథకం వద్ద గోదావరి నీటిమట్టం 19.3 మీటర్లుగా నమోదైందని తెలిపారు.

లోవకు భక్తుల తాకిడి



తలుపులమ్మ తల్లి దర్శనాలకు క్యూ కట్టిన భక్తులు

తుని రూరల్: లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వివిధ జిల్లాల నుంచి తరలి వచ్చిన పది వేల మంది భక్తులు తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకున్నారని దేవస్థానం ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. ప్రత్యేక వాహనాల్లో వచ్చిన భక్తులు బాలాలయంలో ఉన్న అమ్మవారిని క్యూలో దర్శించుకున్నారన్నారు. లడ్డూ, పులిహోర ప్రసాదాలు, పూజా టికెట్లు, వాహన పూజలు, కేశఖండన, వసతి గదులు, కాటేజీల అద్దెలు, విరాళాలు కలిపి అమ్మవారికి రూ.3,38,441 ఆదాయం సమకూరిందని వివరించారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, ధర్మకర్తలు, శ్రీవారి సేవకులతో కలిసి ఈఓ పర్యవేక్షించారు.

సర్వే జనా సురక్ష



రాజమహేంద్రవరం రూరల్ శాటిలైట్ సిటీ జగనన్న ఆరోగ్య సురక్షలో రక్త పరీక్షలు చేస్తున్న సిబ్బంది



జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో భాగంగా ఓ ఇంటి వద్ద మహిళకు బీపీ పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

- ముమ్మరంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే
- ఉచితంగా ఏడు రకాల వైద్య పరీక్షలు
- ప్రతి ఒక్కరి మొబైల్‌లో యాప్ డౌన్‌లోడ్
- వ్యాధిని బట్టి వైద్య శిబిరం లేదా ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్యం
- ఇకపై ప్రజలకు మరింతగా ఆరోగ్య భద్రత

రాజమహేంద్రవరం రూరల్: పేదలు తమ ఆరోగ్యంపై ఇక బెంగ పడనవసరం లేదు. ఆస్పత్రికి వెళ్లాలన్నా.. మందులు కొనాలన్నా.. డబ్బులు చాలవేమోననే ఆందోళన కూడా అక్కర్లేదు. ఏ రుగ్మత వచ్చినా యాప్ డౌన్‌లోడ్ చేసుకుని, ఆ వివరాలు నమోదు చేస్తే వెంటనే ఏఎన్‌ఎం ఇంటికే వచ్చి తక్షణ వైద్య సాయం అందేలా చూస్తారు. ఉపశమనం లభించకపోతే వైద్యాధికారి ఇంటి వద్దకే వస్తారు. ప్రజల వద్దకు పాలన నినాదంతో ముందుకెళ్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం.. ఇప్పుడు ఆ ప్రజల ముంగిటనే సంపూర్ణ వైద్య సేవలు అందించే ప్రక్రియకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా నాంది పలికింది.

జగనన్న సురక్ష తరహాలోనే..

ఇప్పటికే జగనన్న సురక్ష ద్వారా ఇంటి వద్దకే అన్ని రకాల సేవలనూ తీసుకువచ్చిన ప్రభుత్వం.. ఇప్పుడు ఆ తరహాలోనే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా తొలుత ఏఎన్‌ఎంలు, వలంటీర్లు జగనన్న ఆరోగ్య సురక్ష యాప్‌ను తమ మొబైల్ ఫోన్లలోకి డౌన్‌లోడ్ చేసుకుని, ఇంటింటి సర్వే చేపడతారు. ఇంట్లోని సభ్యుల సంఖ్య, అందరూ ఆరోగ్యంగా ఉన్నారా, లేదా, ఎవరికైనా ఏవైనా ఆరోగ్య సమస్యలున్నాయా, ఉంటే వాటికి చికిత్స పొందుతున్నారా తదితర వివరాలు సేకరిస్తారు. సర్వే ద్వారా గుర్తించిన అనారోగ్య పీడితులకు ఆయా ప్రాంతాల పరిసరాల్లోనే ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించి కార్పొరేట్ వైద్య నిపుణుల ద్వారా చికిత్స అందిస్తారు. అవసరమైతే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్సలూ చేయిస్తారు. ఉచితంగా మందులూ అందజేస్తారు. వైఎస్సార్ ఆరోగ్య ఆసరా ద్వారా సాయం కూడా అందిస్తారు.

ముమ్మరంగా సర్వే

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ప్రస్తుతం ముమ్మరంగా సాగుతోంది. జిల్లాలోని 150 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, 129 గ్రామీణ ప్రాంతాలు, 21 పట్టణ ప్రాంతాల్లో ఇంటింటి సర్వే చేపట్టారు. ఏఎన్‌ఎంలు, వలంటీర్లు జగనన్న ఆరోగ్య సురక్ష యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఈ సర్వే చేస్తున్నారు. ఇంటి వద్దనే కుటుంబ సభ్యులందరికీ ఏడు రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఆ కుటుంబంలోని వ్యక్తి సెల్‌ఫోన్‌లో జగనన్న సురక్ష యాప్ డౌన్‌లోడ్ చేసి, సర్వే వివరాలు అందులో అప్‌లోడ్ చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 2,19,997 కుటుంబాలు ఉండగా, శనివారం మధ్యాహ్నం నాటికి 68,001 కుటుంబాలపై జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే పూర్తి చేశారు. 1,80,892 వైద్య పరీక్షలు చేశారు.

ఈ యాప్ ఆపద్బాంధవే..

జగనన్న ఆరోగ్య సురక్ష యాప్ ఉంటే ఆరోగ్యానికి భరోసా దొరికినట్లేనని అధికారులు చెబుతున్నారు. అర్ధరాత్రి, అపరాత్రి అనే భయం లేకుండా కుటుంబంలో ఎవరికి ఆరోగ్యం బాగా లేకపోయినా ఆ వివరాలను ఈ యాప్‌లో పొందుపరిస్తే వెంటనే దగ్గరలోని ఏఎన్‌ఎం వచ్చి చికిత్స అందిస్తారు. ఇది రోగులకు ప్రథమ చికిత్సగా ఉపయోగపడుతుంది. దీని వలన అత్యవసరంగా ఆస్పత్రులకు పరుగెత్తాల్సిన అవసరం ఉండదు. ముందుగా ఏఎన్‌ఎం, తర్వాత రోగి పరిస్థితిని బట్టి వైద్యాధికారి కూడా రోగి చెంతకు వస్తారు.

ఆరోగ్యశ్రీ వివరాలు తెలిపే కరపత్రాలు పంపిణీ

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు మరో మేలు కూడా జరుగుతోంది. ఇప్పటి వరకూ ఏయే వ్యాధులు ఆరోగ్యశ్రీ పరిధిలోకి వస్తాయి, వాటిని పొందాలంటే ఏ పేపర్లు తీసుకెళ్లాలి, అత్యవసర వైద్య సాయం పొందే విధానం ఏమిటనే అంశాలు క్షుణ్ణంగా తెలిసేలా కరపత్రాలు ముద్రించి, ప్రతి ఇంటికీ పంపిణీ చేస్తున్నారు. దీనివలన ప్రతి ఒక్కరికీ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ వైద్య సేవలు ఏవిధంగా పొందవచ్చో అవగాహన కలుగుతోంది.

ఈ నెల 16 - 23వ తేదీ మధ్య నిర్వహించిన ఆరోగ్య పరీక్షల వివరాలు

రక్తపోటు (బీపీ)	:	64,898
మధుమేహం (షుగర్)	:	50,618
మూత్ర (యూరిన్)	:	2,264
హిమోగ్లోబిన్	:	59,151
మలేరియా	:	1,208
డెంగీ	:	1,098
కఫం	:	1,655
మొత్తం పరీక్షలు	:	1,80,892

రోగి కోలుకునే వరకూ భరోసా

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో చికిత్స పొందిన రోగి కోలుకోవడానికి కొంత సమయం పడుతుంది. ఆ సమయంలో వారి జీవనానికి ఇబ్బంది కలగకుండా వైఎస్సార్ ఆరోగ్య ఆసరా ద్వారా రోజుకు రూ.225 చొప్పున నెలకు రూ.5 వేల వరకూ ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోంది. తద్వారా కష్ట కాలంలో ఆ కుటుంబానికి భరోసానిస్తోంది.

రేపు కాతేరులో ఆరోగ్య శిబిరం ట్రయల్ రన్

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఈ నెల 30వ తేదీ నుంచి వైద్య శిబిరాలు నిర్వహించాల్సి ఉంది. దీనికి అవసరమైన మందులు తదితర అన్ని ఏర్పాట్లూ ముందుగానే చేసుకోవాలని సంబంధిత అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఇందులో భాగంగా రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరులోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో మంగళవారం వైద్య శిబిరం ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. ఆరోగ్య శిబిరాల్లో 162 రకాల మందులు, 18 రకాల శస్త్రచికిత్స వినియోగ వస్తువులు, 14 రకాల ఎమర్జెన్సీ కిట్లు అందుబాటులో ఉంచుతారు. ఆరోగ్య శిబిరాలకు పీహెచ్‌సీలోని ఇద్దరు వైద్యులతో పాటు ఫ్యామిలీ డాక్టర్, ఇతర సిబ్బందితో పాటు స్పెషలిస్టు డాక్టర్లు కూడా హాజరవుతారు.

జోరుగా ఇంటింటి సర్వే



జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే ద్వారా వైద్య పరీక్షలు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటి వరకు 68,001 ఇళ్లల్లో సర్వే పూర్తి చేశాం. 1,80,892 ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ నెల 26న కాతేరులో ఆరోగ్య శిబిరం ట్రయల్ రన్ జరుగుతుంది. ఈ నెల 30వ తేదీ నుంచి షెడ్యూల్ ప్రకారం ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తాం.

– డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి

గూటం స్వామికి జాషువా పురస్కారం



గూటం స్వామి

రాజమహేంద్రవరం రూరల్: మహాకవి గుర్రం జాషువా జయంతి సందర్భంగా ప్రముఖ కవి, రచయిత డాక్టర్ గూటం స్వామికి బహుజన రచయితల వేదిక గుర్రం జాషువా సాహిత్య పురస్కారాన్ని ప్రకటించింది. ఈ మేరకు నిర్వాహకుల నుంచి లేఖ అందిందని స్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న ఎన్‌టీఆర్ జిల్లా కంచికచర్లలో జరిగే జాషువా జయంతి సభలో ఈ పురస్కారం అందుకోనున్నానని పేర్కొన్నారు. తెలుగు భాషాభివృద్ధి సమితి అధ్యక్షుడిగా స్వామి సాహిత్య సేవ చేస్తున్నారు. ఇంతవరకూ వివిధ ప్రక్రియల్లో ముప్పైకి పైగా పుస్తకాలు రాసి, ప్రచురించారు. ఆయన రాసిన యశోధర నవల పలు అవార్డులు గెలుచుకుంది. తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారంతో, రాష్ట్ర ప్రభుత్వం 2017లో గిడుగు రామ్మూర్తి పంతులు భాషా సేవా పురస్కారంతో సత్కరించాయి. పలు సాహిత్య సంస్థల సత్కారం కూడా ఆయన అందుకున్నారు. సాహిత్య సవ్యసాచి బిరుదు కూడా పొందారు. జాషువా పురస్కారం అందుకోబోతున్న స్వామిని ప్రముఖ కవి ఆచార్య శిఖామణి, ఆచార్య ఈశ్వర్‌రెడ్డి, స్వర్ణాంధ్ర వ్యవస్థాపకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు తదితరులు అభినందించారు.

6.7 మిల్లీమీటర్ల వర్షపాతం

కొవ్వూరు: జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఉదయం 8.30 గంటలతో ముగిసిన 24 గంటల వ్యవధిలో 6.7 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. కడియంలో గరిష్ఠంగా 47 మిల్లీమీటర్లు కురిసింది. సీతానగరం 10, గోకవరం 8.4, రాజమహేంద్రవరం రూరల్ 15.4, నల్లజర్ల 10.4, నిడదవోలు 12.8, గోపాలపురం 7, తాళ్లపూడి 3, దేవరపల్లి 2.4, కొవ్వూరు 3.2, ఉండ్రాజవరం 2.4 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

ఆవులను తరలిస్తున్న వ్యాన్ సీజ్




పోలీసులు స్వాధీనం చేసుకున్న గోవులు

పిఠాపురం: అక్రమంగా గోవులను తరలిస్తున్న వ్యాన్‌ను ఆదివారం స్వాధీనం చేసుకున్నామని పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వ్యాన్‌లో గోవులను అక్రమంగా తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పిఠాపురం మండలం జల్లూరు వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అటుగా వస్తున్న ఒక బొలేరో వ్యాన్‌ను ఆపి తనిఖీ చేయగా దానిలో పది గోవులున్నాయని గుర్తించారు. వీటిని విజయనగరం జిల్లా మెంటాడ నుంచి సామర్లకోట కబేళాకు తరలిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు గోవులను, వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వ్యాన్ డ్రైవరును అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న గోవులను గోశాలకు తరలించామని సీఐ తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు అభినందన

కాకినాడ రూరల్: భిలాయ్‌లో 29వ ఇండియన్ నేషనల్ బెంచ్‌ప్రెస్ అండ్ డెడ్‌లిఫ్ట్ చాంపియన్‌షిప్స్ ఆధ్వర్యాన జాతీయ స్థాయి మాస్టర్స్-2 విభాగం పోటీలు ఇటీవల జరిగాయి. ఇందులో మొదటి స్థానంలో నిలిచి, బంగారు పతకాలు సాధించిన కాకినాడ డిపో ఆర్టీసీ డ్రైవర్ మందపల్లి శ్రీనివాసరావును ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అభినందించారు. బాడీబిల్డర్‌గా పలు పోటీల్లో సాధించిన మెడల్స్, సర్టిఫికెట్లను రమణయ్యపేటలోని క్యాంపు కార్యాలయంలో కన్నబాబుకు శ్రీనివాసరావు ఆదివారం చూపించారు. వాటిని చూసి, ప్రశంసించిన కన్నబాబు ప్రభుత్వ పరంగా గుర్తింపు లభించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు.

పేద విద్యార్థుల ప్రోత్సాహానికి విద్యానిధి




ఆర్థిక సహాయం, ల్యాప్‌టాప్‌లు అందుకున్న విద్యార్థులతో లయన్స్ క్లబ్ ప్రతినిధులు


- లయన్స్ ట్రస్టు చైర్మన్ తిరుమలరావు
- 74 మందికి రూ.8 లక్షల సాయం

సామర్లకోట: పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు లయన్స్ క్లబ్ ట్రస్టు ఏర్పాటు చేసిందని ట్రస్టు జిల్లా చైర్మన్ దాసరి తిరుమలరావు తెలిపారు. స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా క్లబ్ సభ్యులు ప్రత్యేక విద్యానిధి ద్వారా వచ్చే వడ్డీతో ఏటా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నారని తెలిపారు. సామర్లకోట, కాకినాడ, రాజమహేంద్రవరం, మండపేట, యానాం, తాళ్లరేవు, అమలాపురం ప్రాంతాల్లో ఇంటర్ నుంచి ఇంజినీరింగ్ వరకూ చదువుతున్న 74 మంది విద్యార్థులకు రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకూ ఆర్థిక సాయం, ఐదుగురికి ల్యాప్‌టాప్‌లు అందజేశారు. మొత్తం రూ.8 లక్షల విలువైన వితరణ చేశారు. లయన్స్ క్లబ్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ బాదం బాలకృష్ణ మాట్లాడుతూ, పేదలకు సాయం చేయాలనే లక్ష్యంతో లయన్స్ క్లబ్ ఏర్పాటు చేశారని అన్నారు. లయన్స్ క్లబ్ స్థానిక అధ్యక్షుడు కానుబోయిన విజయకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఏలూరి సత్యనారాయణ, ట్రస్టు కార్యదర్శి కాటూరి గోపాలకృష్ణ, ఉపాధ్యక్షుడు చిట్టునేడి శ్రీనివాసు, కోశాధికారి ఉమామహేశ్వరరావు, సహాయ కోశాధికారి శ్యామ్, క్లబ్ ఉప గవర్నర్ ఈదల ఈశ్వరకుమార్, జిల్లా చైర్మన్ చిత్తూరి వీర్రాజు, క్లబ్ కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయం కిటకిట



స్వామివారి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు



విశేషాలంకరణలో విఘ్నేశ్వరస్వామి

అయినవిల్లి: గణపతి నవరాత్రుల్లో భాగంగా అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. గంటల కొద్దీ క్యూలో ఉండి మరీ స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. స్వామివారిని 25 వేల మంది దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యాన రుత్విక్కులు విశేష పూజలు జరిపారు. స్వామివారికి పంచామృతాభిషేకం, లక్ష్మీ గణపతి హోమం, లక్ష గరిక అర్చన వంటి విశేష పూజలు జరిపారు. లఘున్యాస, ఏకవార, ఏకాదశ రుద్రాభిషేకాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామికి విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకాలు 11 మంది, లఘున్యాస అభిషేకాలు 294 మంది నిర్వహించారు. లక్ష్మీ గణపతి హోమంలో 102 మంది పాల్గొన్నారు. స్వామివారి సన్నిధిలో ఏడుగురు చిన్నారులకు నామకరణ, 30 మందికి అక్షరాభ్యాసం, ఒకరికి అన్నప్రాశన, 14 మందికి తులాభారం నిర్వహించారు. స్వామివారికి ఆరుగురు భక్తులు తలనీలాలు సమర్పించారు. అన్నదాన విరాళాలు, పులిహోర, లడ్డూ ప్రసాదాల విక్రయం, తదితర మార్గాల ద్వారా స్వామివారికి రూ.4,74,835 ఆదాయం సమకూరిందని ఆలయ కమిటీ చైర్మన్ గుత్తుల నాగబాబు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

కష్టజీవిపై కారుణ్యపు జల్లు

- ఆర్టీసీలో పెద్ద ఎత్తున నియామకాలు
- దాదాపు 14 ఏళ్ల తరువాత ఈ స్థాయిలో..
- ఉమ్మడి జిల్లాలో 110 ఉద్యోగాలు
- ఇప్పటి వరకూ 86 మంది నియామకం
- మరో 24 మందిని నియమించేందుకు కసరత్తు





కారుణ్య నియామకాల కల్పనకు కసరత్తు చేస్తున్న ఆర్టీసీ అధికారులు

రాజమహేంద్రవరం సిటీ: తన రెక్కల కష్టంతో కుటుంబానికి ఆధారంగా, వెన్నుదన్నుగా నిలిచే వ్యక్తి ఊహించని కారణాలతో ఆకస్మికంగా మృతి చెందితే.. ఆ ఇంట్లోని వారు పడే బాధ అంతా ఇంతా కాదు. వస్తున్న ఆదాయంపై ఆధారపడి కుటుంబాన్ని నడపడమే కాకుండా.. పిల్లల చదువులు, పెళ్లిళ్లు, ఇంటి నిర్మాణం.. ఇలా వారు కన్న ఎన్నో కలలు హఠాత్తుగా అర్ధాంతరంగా కరిగిపోతాయి. సంసార సాగరాన్ని ఎలా ఈదాలో అర్థం కాక తల్లడిల్లుతారు. అయితే, ఇలా మరణించే ప్రభుత్వోద్యోగుల కుటుంబాలను ఆదుకొనేందుకు ప్రభుత్వం కారుణ్య నియామకాలు జరుపుతోంది. అంటే ఆ కుటుంబంలో అర్హులైన ఒకరికి ఉద్యోగం కల్పిస్తారు. తద్వారా అర్ధాంతరంగా రోడ్డున పడిన ఆ కుటుంబాన్ని ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆదుకుంటుందన్నమాట. ఈ విధానాన్ని ప్రభుత్వాలు గతం నుంచీ అమలు చేస్తున్నా.. గత ప్రభుత్వ హయాంలో కారుణ్య నియామకాలు దాదాపు శూన్యమనే చెప్పాలి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మాత్రం మునుపెన్నడూ లేని స్థాయిలో కారుణ్య నియామకాలు జరుపుతోంది. వివిధ శాఖల్లో మాదిరిగానే ఆర్టీసీలో ఈ తరహా నియామకాలు పెద్ద ఎత్తున కల్పించింది.

మూడు దశల్లో..

ఏపీఎస్ ఆర్టీసీకి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా రాజమహేంద్రవరం, కాకినాడ, రావులపాలెం, రామచంద్రపురం, తుని, ఏలేశ్వరం, గోకవరం, అమలాపురం, రాజోలుల్లో డిపోలు ఉన్నాయి. ఈ తొమ్మిది డిపోల్లో పని చేస్తూ, కరోనా, వివిధ ప్రమాదాలతో పాటు, ఆకస్మిక, సహజ మరణాలతో ప్రాణాలు కోల్పోయిన ఉద్యోగుల కుటుంబాల్లో అర్హులైన వారికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనిపై తక్షణమే స్పందించిన అధికారులు మూడు దశల్లో ఉద్యోగాలు కల్పించేందుకు చర్యలు చేపట్టారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన తరువాత పెద్ద ఎత్తున కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు కల్పిస్తున్నారు. ఇప్పటి వరకూ 110 మందికి ఉద్యోగాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయగా, వీరిలో ఇప్పటికే 86 మందికి ఆర్టీసీతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు కల్పించారు. అలాగే, ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనమైన అనంతరం 2020 జనవరి ఒకటో తేదీ తరువాత మృతి చెందిన మరో 24 మంది ఉద్యోగుల కుటుంబాల్లోని వారికి ఉద్యోగాలు కల్పించేందుకు కూడా పర్సనల్ ఆఫీసర్ ఎస్వై ప్రసాద్ నేతృత్వంలో చర్యలు తీసుకుంటున్నారు. ఆర్ రాజమహేంద్రవరం సూపరింటెండెంట్ సత్యనారాయణ, కాకినాడ, కోనసీమ జిల్లాలకు చెందిన కేజేవీ సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ కేవీ హనుమంతరావు కూడా ఈ కసరత్తులో పాలు పంచుకుంటున్నారు. ఆయా ఉద్యోగుల కుటుంబ సభ్యుల అర్హతలను పరిశీలించి ఏయే ఉద్యోగాలకు అర్హులో గుర్తించి, జాబితా సిద్ధం చేసేందుకు చర్యలు చేపట్టారు. ఆర్టీసీలో డ్రైవర్, కండక్టర్, అసిస్టెంట్ మెకానిక్ ఉద్యోగాలకు వీరిని ఎంపిక చేయడంపై దృష్టి సారించారు. దాదాపు 14 సంవత్సరాల తర్వాత ఈ స్థాయిలో కారుణ్య ఉద్యోగాలు కల్పించడంపై ఆయా కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

కారుణ్య నియామకాలు జరిగాయిలా..

దశ	ఉద్యోగాలు	కారుణ్య నియామకాలు
1	66	ప్రభుత్వ ఉద్యోగాలు, గ్రామ సచివాలయ సెక్రటరీలు
2	14	ఆర్టీసీలో జూనియర్ అసిస్టెంట్లు, కానిస్టేబుల్, శ్రామిక్, గ్యారేజ్ మెకానిక్
3	6	గ్రూప్-4 ఉద్యోగాలు (కలెక్టర్ నియామకాలు)

మిగిలిన వారికి వచ్చే నెలలో ఉత్తర్వులు



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ఇప్పటి వరకూ 86 మందికి వివిధ చోట్ల కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించాం. మిగిలిన 24 మంది అర్హతలనూ పరిశీలిస్తున్నాం. వీరిలో అర్హతలున్నట్టు గుర్తించిన వారికి వచ్చే నెల మొదటి వారంలో నియామక ఉత్తర్వులు అందజేస్తాం. ఎటువంటి అర్హతలూ లేని వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం అదనపు ఆర్థిక సహాయం అందించేందుకు చర్యలు చేపడతాం. పూర్తి పారదర్శకతతో కమిటీ నివేదిక ఆధారంగా కారుణ్య నియామకాలు జరుపుతున్నాం. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనమైన తరువాత ఈ స్థాయిలో కారుణ్య నియామకాలు జరపడం ఇదే ప్రథమం.

– షర్మిల అశోక్, జిల్లా ప్రజారవాణా అధికారి, తూర్పు గోదావరి

క్లుప్తంగా

27న నిధి ఆప్ కే నిఖత్ డిస్ట్రిక్ట్ ఔట్ రీచ్ ప్రోగ్రాం

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం ఈపీఎఫ్‌వో ప్రాంతీయ కార్యాలయం అధికార పరిధిలో ఈ నెల 27వ తేదీన ఉదయం 9.00 గంటలకు నిధిఆప్‌కేనిఖత్ యజమాని(ఎమ్మోయర్) అవగాహన కార్యక్రమం నిర్వహిస్తారు. ఈమేరకు అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ వైడి.శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా మండపేటలో దిఆలమూరు రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ బిల్డింగ్‌లోను, డాక్టర బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని ఎస్‌కేబీఆర్ కళాశాలలోను, కాకినాడ జిల్లా తునిలోని శ్రీప్రకాష్ ఎడ్యుకేషనల్ సొసైటీలోను, ఏలూరు జిల్లా నిడదవోలు పచ్చిపులుసు వారి కల్యాణ మంటపంలోను, పశ్చిమగోదావరిజిల్లా ఆకివీడు మెయిన్‌రోడ్డులోని శ్రీబాలాజీరైస్‌మిల్లులోను, అల్లూరిసీతారామరాజు జిల్లా వై.రామవరం మండలం డొంకరాయిలోని ఈఈ ఆఫీసు, గంగవరం మండలం గంగవరం పంచాయతీ కార్యాలయంలోను, మారేడుమిల్లి మండలం మారేడుమిల్లి పంచాయతీ కార్యాలయంలోను నిధిఆప్‌కే నిఖత్ యజమాని అవగాహన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఈసీఆర్, రిటర్న్ అవగాహన, యుఏఎన్‌లో సరైన కేవైసీ వివరాలను ఫీడింగ్ చేయడం, సభ్యుల వివరాలు సకాలంలో దిద్దుబాటు చేస్తామన్నారు. సభ్యులు, పింఛనుదారులు, ఎస్టాబ్లిష్మెంట్‌లు, కొత్తగా కవర్ అయిన ఎస్టాబ్లిష్మెంట్‌లు ఈ అవుట్ రీచ్ ప్రోగ్రాంను ఉపయోగించుకోవాలన్నారు. నిధిఆప్‌కేనిఖత్ అని పేర్కొంటూ తమ ఫిర్యాదులను సమర్పించాలన్నారు. డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ సమర్పించడానికి ఈ క్యాంపును సందర్శించవచ్చని అసిస్టెంట్ పీఎఫ్ కమీషనర్ శ్రీనివాస్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

జగ్గంపేట: మేడపై వున్న ఫ్లెక్సీ బోర్డుకు సంబంధించిన చట్రాలు తీసే క్రమంలో అక్కడే వున్న 11 కేవీ విద్యుత్ వైర్లకు తగిలి విద్యుత్ షాకుకు గురై యువకుడు మృతిచెందాడు. జగ్గంపేట ఎస్సై నాగార్జునరాజు చెప్పిన వివరాల ప్రకారం జగ్గంపేట మండలం రామవరం గ్రామానికి చెందిన కాకులపాటి వీరబాబు ఫ్లెక్సీ ప్రేముల కోసం తనకి తెలిసిన వ్యక్తి దుకాణం వద్దకు తన కుమారుడు నాగేంద్రప్రసాద్ (17)ను ఆదివారం పంపాడు. మేడపై వున్న ప్రేము తీసేటప్పుడు అక్కడే వున్న కరెంట్ వైర్లకు అది తగలడంతో నాగేంద్ర ప్రసాద్ స్పృహ తప్పి పడిపోయాడు. స్థానికంగా వున్న ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. దీనిపై మృతుడు తండ్రి వీరబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగార్జునరాజు వివరించారు.

‘నన్నయ’లో ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సు

- సీఎస్ఐఆర్‌తో అవగాహన ఒప్పందం
- యువత ఉపాధి అవకాశాలకు మెరుగైన రంగం

రాజానగరం: ఆహార సాంకేతికత (ఫుడ్ టెక్నాలజీ) అనేది ఆహార శాస్త్రంలో ఒక శాఖ. ఇది ఆహార ఉత్పత్తుల సంరక్షణ, నాణ్యత నియంత్రణ, పరిశోధన, అభివృద్ధిని సూచిస్తుంది. ఈ విషయాన్ని గ్రహించిన అదికవి నన్నయ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు గోదావరి జిల్లాలలోని యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాలనే ఆశయంతో ఎమ్మెస్సీలో ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సుకు శ్రీకారం చుట్టారు. ఫుడ్ ప్రాసెసింగ్‌లో మ్యాన్‌పవర్‌కి పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో ఇటువంటి కోర్సుల ఆవశ్యకతను గుర్తించారు. సెంట్రల్ ఫుడ్ టెక్నాలజీ ఫర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీఎఫ్‌టీఆర్ఐ), కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రీయల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్), మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా (మైసూర్) సహకారంతో ‘నన్నయ’ వర్సిటీలో ఈ విద్యా సంవత్సరం నుంచి ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సును ప్రవేశపెడుతున్నారు.

పీజీ సెట్ ద్వారా ప్రవేశాలు

ఏపీ పీజీ సెట్ ద్వారా ప్రస్తుతం జరుగుతున్న కౌన్సెలింగ్‌లో ‘ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సైన్స్‌ని ఎంపిక చేసుకొని ఈ కోర్సులో చేరవచ్చు. ఎమ్మెస్సీ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సు చేసేందుకు బీఎస్సీ ఫుడ్ టెక్నాలజీ, బీఎస్సీ ఒకేషనల్ ఫుడ్ టెక్నాలజీ, బీఎస్సీ బయో టెక్నాలజీ, బీఎస్సీ మైక్రోబయాలజీ, బీఎస్సీ బయోకెమిస్ట్రీ, బీఎస్సీ హోమ్‌సైన్స్, బీఎస్సీ అప్లైడ్ న్యూట్రిషన్, బీఎస్సీ రూరల్ హోమ్ సైన్స్, క్లినిక్ న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్, బీఎస్సీ ఫుడ్ సైన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్, బీఎస్సీ న్యూట్రిషన్ ఒక పేపరుగా ఉండి 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండవలసి ఉంటుంది. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ప్రస్తుతం 20 సీట్లతో ఈ కోర్సును ప్రారంభిస్తున్నారు.

రూ.80 లక్షలతో ప్రత్యేక ల్యాబ్

‘నన్నయ’ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సును అమలు చేసేందుకుగాను రూ.80 లక్షల వ్యయంతో ప్రత్యేక ల్యాబ్‌ని ఏర్పాటు చేయనున్నారు. సీఎఫ్‌టీఆర్ఐ వంటి ప్రముఖ సంస్థలలో 40 సంవత్సరాలపాటు అధ్యాపక వృత్తిలో సేవలందించిన ఆచార్య పి.రామకృష్ణను ఈ కోర్సుకు కోఆర్డినేటర్‌గా నియమించారు. యూజీసీ నిబంధనలను అనుసరించి అనుభవజ్ఞులైన అధ్యాపకులతో కోర్సును సమర్థవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.



మైసూరులో సీఎస్ఐఆర్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుని పత్రాలు మార్చుకుంటున్న ఉపకులపతి ఆచార్య పద్మరాజు





నాణ్యమైన విద్యతోపాటు ఉపాధి అవకాశాలు

గోదావరి జిల్లాలలోని యువతకు నాణ్యమైన విద్యతోపాటు మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పించేందుకు మా వంతు కృషి చేస్తున్నాం. భారతదేశంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగం 2024 నాటికి 9 మిలియన్ల ఉద్యోగాలను సృష్టిస్తుంది. యువతకు మంచి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అనువైన రంగంగా అభివృద్ధి చెందనుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ‘నన్నయ’ వర్సిటీలో ఎమ్మెస్సీలో ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ’ని ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభిస్తున్నాం. ఇటీవల మైసూరులోని సీఎఫ్‌టీఆర్ఐని సందర్శించినప్పుడు ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సు గురించి అక్కడ డైరెక్టర్లతో మాట్లాడాను. యూనివర్సిటీలో ఈ కోర్సును ప్రవేశపెడితే అందుకు అవసరమైన మార్గదర్శకాలు ఇవ్వడానికి వారు సుముఖతను వ్యక్తపరిచారు. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రీయల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్) ప్రధాన సంస్థగా ఉన్నందున, ఈ కోర్సుకు సంబంధించి విద్యా కార్యకలాపాలు ఆ సంస్థ నుంచి పొందేందుకు విద్యానిపుణులు, శాస్త్రవేత్తలు సహకరిస్తారని మాటిచ్చారు. విద్యార్థులకు మైసూరులో పూర్తి సెమిస్టర్ ఇంటర్న్‌షిప్‌కు అవకాశం కూడా కలిస్తారు. ఈ మేరకు సీఎస్ఐఆర్‌తో అవగాహన ఒప్పందం కూడా కుదుర్చుకున్నాం.



– ఆచార్య కె. పద్మరాజు, ఉపకులపతి, ఆదికవి నన్నయ యూనివర్సిటీ

సత్యదేవుని ఆలయం కిటకిట



సత్యదేవుని దర్శనానికి క్యూ లో వేచివున్న భక్తులు

- స్వామిని దర్శించిన 30 వేల మంది
- ఆదాయం రూ.30 లక్షలు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయం ఆదివారం సెలవు దినం సందర్భంగా వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో కిట కిట లాడింది. సత్యదేవుని దర్శనానికి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం, వ్రత మంటపాలు, విశ్రాంతి మంటపాలు నిండిపోయాయి. వీరంతా సత్యదేవుని వ్రతాలాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. దీంతో స్వామివారి దర్శనానికి గంట, ప్రదక్షిణ దర్శనానికి అరగంట సమయం పట్టింది. సుమారు 30 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించారు. సత్యదేవుని వ్రతాలు రెండు వేలు జరిగాయి. సత్యదేవుని దర్శించిన భక్తులు స్వామివారి గోకులంలో గోవులకు ప్రదక్షిణ చేసి రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. అన్నదాన పథకంలో నాలుగు వేల మంది భక్తులకు భోజన సౌకర్యం కలుగచేశారు.

సత్యదేవునికి ఏకాదశి పూజలు

భాద్రపద శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా సోమవారం సత్యదేవుడు, అనంతలక్ష్మి సత్యవతీదేవి, శంకరుల మూలవరులకు ఉదయం ఏడు గంటలకు స్వర్ణపుష్పాలతో, 11 గంటలకు సహస్ర పుష్పార్చన నిర్వహిస్తారు.

ఏమైందో ఏమో?



ప్రవీణకుమారి (ఫైల్)

అదృశ్యమైన బాలిక మృత్యు ఒడిలోకి

పెద్దాపురం: పసిప్రాయం... అభం శుభం తెలియని వయసు.. ఏమైందో ఏమో పట్టుమని పదేళ్లు దాటని ఆ బాలిక ఆదివారం రాత్రి శవమై కనిపించడంతో పట్టణంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. నాలుగు రోజుల క్రితం అదృశ్యమైన బాలిక స్థానిక కట్టమూరు పుంతలో శవమై కనిపించడంతో పదేళ్లు దాటకుండానే నిండు నూరేళ్లు నిండిపోయాయా అంటూ తల్లి జ్యోతి విలపించిన తీరు చూపరులకు కంటతడి పెట్టించింది. ఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళితే... స్థానిక ఎన్‌టీఆర్ నగర్‌లో ఉంటున్న బాలిక తల్లి పదేళ్ల కుమార్తె ప్రవీణకుమారి కనిపించడం లేదని ఈ నెల 20వ తేదీన పెద్దాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి దర్యాప్తు చేస్తున్న పోలీసులు ఆదివారం సాయంత్రం కట్టమూరు పుంత శివారులో కుళ్లిపోయిన స్థితిలో ఉన్న ఓ బాలిక మృతదేహాన్ని కనుగొన్నారు. ఆ మృతదేహం ఎవరిది అనే కోణంలో విచారణ చేయగా బాలిక ఒంటిపై ఉన్న దుస్తుల ఆధారంగా నాలుగు రోజుల కిందట అదృశ్యమైన బాలికగా గుర్తించారు. దీంతో ఆ చిన్నారి తల్లిదండ్రులను పిలిపించి బాలిక మృతదేహం ప్రవీణకుమారిగా నిర్ధారించారు. సమీప బంధువే హత్య చేసి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. సీఐ నబీ పర్యవేక్షణలో ఎస్ఐ సురేష్‌కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

డాక్టర్ యనమదలకు జీవన సాఫల్య పురస్కారం

ప్రజారోగ్య పరిరక్షణలో జాతీయ గుర్తింపు



నటి నేహాధూపియా చేతుల మీదుగా జీవన సాఫల్య పురస్కారాన్ని అందుకుంటున్న డాక్టర్ యనమదల మురళీకృష్ణ

కాకినాడ క్రైం: కాకినాడకు చెందిన ప్రముఖ సాంక్రమిక వ్యాధుల నిపుణుడు డాక్టర్ యనమదల మురళీకృష్ణను ‘జీవన సాఫల్య పురస్కారం’ వరించింది. ప్రజారోగ్య పరిరక్షణలో ఆయన చేస్తున్న కృషికి గాను ఈ గౌరవం దక్కింది. శనివారం దేశ రాజధాని న్యూఢిల్లీలో ద్వారక రాడిసన్ బ్లూ హోటల్‌లో నిర్వహించిన ఆరోగ్య రంగ ప్రతిభా పురస్కారాలు–2023 వేదికగా డాక్టర్ మురళీకృష్ణ ఆయన సతీమణి గీతతో కలిసి ఈ అవార్డును అందుకున్నారు. ప్రముఖ బాలీవుడ్ నటి నేహాధూపియా అవార్డు ప్రదానం చేశారు. ఏటా దేశవ్యాప్తంగా వివిధ స్పెషాలిటీలలో ప్రజారోగ్య పరిరక్షణ కోసం విశేష కృషి చేస్తున్న వైద్య ఉద్దండులను గుర్తించి బ్రాండ్స్ ఇంపాక్ట్ సంస్థ హెల్త్ కేర్ ఎక్సలెన్స్ అవార్డులను ప్రకటిస్తోంది. దేశ వ్యాప్తంగా ఏడుగురు మాత్రమే ఎంపికైన ఈ ప్రఖ్యాత పురస్కారాలలో కాకినాడకు చెందిన డాక్టర్ మురళీకృష్ణకు స్థానం దక్కడం విశేషం. 23 ఏళ్ల క్రితం అవిభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాకినాడ కేంద్రంగా వైద్యుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన డాక్టర్ మురళీకృష్ణ హెచ్‌ఐవీ చికిత్సలో దిట్ట. 6,000 మంది బాధితులకు చికిత్స అందించి వారి జీవన కాలాన్ని వృద్ధి చేసి, ప్రమాణాలను మెరుగు చేశారు. కోవిడ్ వేళ అమలులో ఉన్న విస్తృత ప్రచారం పొందిన మూడు ఔషధాల చికిత్సా విధానాన్ని రెండు ఔషధాల చికిత్సకు అన్వయించి సత్ఫలితాలు పొంది చవకైన ఈ వైద్య విధానానికి విస్తృత ప్రచారం కల్పించారు. పేద, నిరుపేద వర్గాల్లో ప్రఖ్యాత వర్గాల్లోనూ ఉన్నత విలువలున్న వైద్యుడిగా మన్ననలు పొందారు.

కోవిడ్ విజృంభిస్తున్న వేళలోనే కోవిడ్ తదనంతర ఆరోగ్య అత్యయిక స్థితిపై డాక్టర్ మురళీకృష్ణ నిరంతర అధ్యయనాల ద్వారా ముందుగానే అంచనాకు వచ్చారు. విపత్తు అనంతరం విపరీతాలపై జనబాహుళ్యాన్ని అప్రమత్తం చేశారు. గుండె జబ్బుల ముప్పును అంచనా వేసి నివారణకు సశాస్త్రీయ వైద్య విధానాలను పరిచయం చేశారు.

ఆ ఆందోళనలో భారీ ఖర్చు చేయవద్దంటూ రోగుల్లో మనోధైర్యం నింపి ప్రత్యేక డోసేజ్ విధానాల ద్వారా కేవలం ఏస్పిరిన్ వినియోగిస్తూ ఎందరో కోవిడ్ అనుబంధ గుండెపోటు బాధితుల్ని ముప్పు నుంచి గట్టెక్కించారు. వైద్య శాస్త్రంలో విశేష ప్రతిభాపాటవాలు ఉన్న డాక్టర్ మురళీకృష్ణ మంచి రచయిత కూడా. తన అభిరుచికి వైద్య శాస్త్ర పరిశోధనలు, ఫలితాలను అన్వయించి 2000 సంవత్సరంలో ‘ఎయిడ్స్’ అనే పుస్తకాన్ని, 2022లో ‘ కోవిడ్- ఎయిడ్స్- నేను’ అనే మరో పుస్తకాన్ని రచించారు. ఈ రెండు రచనలు విశేష ఆదరణ పొందడంతో పాటు పురస్కారాల వేడుకలో జాతీయ అంతర్జాతీయ వైద్య ప్రముఖుల మధ్య ప్రస్తావనకు వచ్చాయి.

రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ అధ్యక్షునిగా శాస్త్రి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు ఆల్‌ఫ్రెడ్



నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షునిగా ఆ సంఘం కాకినాడ జిల్లా కార్యదర్శి చెందిన పీఎస్ ఎస్ఎన్‌పీ శాస్త్రి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాకినాడ సూర్య కళామందిర్ సమావేశ హాలులో రాష్ట్ర రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్ర కౌన్సిల్ సమావేశం ఆదివారం శాస్త్రి అధ్యక్షతన నిర్వహించారు. రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మొత్తం 36 పదవులకు సభ్యులు నామినేషన్లు వేయగా అన్ని పదవులూ ఏకగ్రీవమయ్యాయి. కొత్త బైలా ప్రకారం మరో 9 పదవులు పెరగగా వీటిని కో ఆప్షన్ పద్ధతిలో రాష్ట్ర స్థాయి ఎన్నికల కమిటీ సోమవారం ప్రకటించనుంది. ప్రధాన కార్యదర్శిగా ఐ.లక్ష్మీనారాయణ (నెల్లూరు), అసోసియేటెడ్ అధ్యక్షునిగా ఆర్.రామ్మూర్తి (బొబ్బిలి), వైస్ ప్రెసిడెంట్‌గా కె.పద్మనాభ (కాకినాడ జిల్లా), జి.జయబాబు (విజయవాడ), వైవీ నర్సింహరావు (బాపట్ల), జయరాం నాయుడు (తిరుపతి), ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా సాహుద్దీన్ (విజయవాడ), బీఎస్ ప్రదీప్‌రాజు (పశ్చిమ గోదావరి), ఎంఆర్‌కే సాయిబాబు (విజయవాడ), కార్యదర్శులుగా ఎస్.నారాయణ (విజయవాడ), బి.లోవకుమార్ (విజయవాడ), సాజిత (కాకినాడ), ట్రెజరర్‌గా వి.నాగరాజు (గుంటూరు), ఉపాధ్యక్షునిగా ఈర్లి శ్రీరామ్మూర్తి (అనకాపల్లి) ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు ఏపీఎన్‌జీఓ నాయకుడు ఆచంట రామారాయుడు, రిటైర్డ్ ఎన్‌సీసీ అసిస్టెంట్ డైరెక్టర్ దాసరి ఆదినారాయణ రావు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.

సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆల్‌ఫ్రెడ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు లక్షల మంది ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులున్నారని తెలిపారు. పెన్షనర్లకు పదకొండో పీఆర్‌సీలో తీవ్ర అన్యాయం జరిగిందని, దీనిని 12వ పీఆర్‌సీలో సరిదిద్దాలని కోరారు. సాధారణ కార్యదర్శి జయబాబు కార్యదర్శి నివేదిక అందించారు. సంఘ బైలాస్‌లో సవరణలపై చర్చించారు. రాష్ట్ర కోశాధికారి నర్సింహం నివేదిక అందించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, రామ్మూర్తి, నాగేశ్వర రావు, కాకినాడ జిల్లా అధ్యక్షుడు కె.పద్మనాభం, ఎన్నికల పరిశీలకులు రాజారావు, జయరాం నాయుడు, ఆరోను, సూర్యప్రకాష్, జేమ్స్, వివిధ జిల్లాల నుంచి 400 మంది సభ్యులు పాల్గొన్నారు.

నయన మనోహరంగా రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం సిటీ: అత్యంత అద్భుతంగా, నయన మనోహరంగా, ప్రజలందరూ మెచ్చుకునేలా నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. స్థానిక జేఎన్ రోడ్డులో హ్యాపీస్ట్రీట్‌ను ఆదివారం ఆయన సందర్శించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు, పిల్లల ఆటపాటల మధ్య కొద్దిసేపు గడిపారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మరో పది రోజుల్లో కంబాల చెరువు పార్కు ఎంతో చూడముచ్చటగా రూపుదిద్దుకోబోతోందన్నారు. ఇప్పటికే పుష్కర ఘాట్, కంబాల చెరువు వద్ద దండిమార్చ్, ప్రతి ప్రధాన జంక్షన్‌ను అందంగా తీర్చిదిద్దామన్నారు.



హ్యాపీ స్ట్రీట్‌లో మాట్లాడుతున్న ఎంపీ భరత్ రామ్, చిత్రంలో కో ఆర్డినేటర్ శ్రీనివాస్

నాణ్యతా విలువలతో పరిశోధనలు



సమావేశంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): వాణిజ్యపంటలలో నాణ్యత విలువలను జోడించి పరిశోధనలు చేపట్టాలని బెంగుళూరు ఐఐహెచ్‌ఆర్ (హార్టికల్చర్) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సీకే నారాయణ అన్నారు. స్థానిక కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ(సీటీఆర్ఐ) సెమినార్ హాల్లో మూడు రోజులుగా సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ అధ్యక్షతన జరుగుతున్న పరిశోధన కమిటీ సమావేశాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సమావేశాలలో డాక్టర్ నారాయణ, హైదరాబాద్ ఐసీఏఆర్‌నార్మ్(ఎకనామిక్స్) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రంజిత్‌కుమార్, ఆచార్య ఎన్‌జీరంగా అగ్రికల్చర్ యూనివర్శిటి హెడ్ (ఎక్స్‌టెన్షన్) డాక్టర్ వి.విజయాభినందన నిపుణులుగా పాల్గొన్నారు. డాక్టర్ శేషుమాధవ్ మాట్లాడుతూ సమావేశంలో పంట అనంతరం విలువ జోడింపు విభాగంలోని పరిశోధనలపై విస్తృత చర్చలు జరిగాయి. ఇతర వాణిజ్య పంటలైన పసుపు, మిరప, అశ్వగంధ, ఆముద సీటీఆర్ఐ పరిశోధనలో భాగంగా జోడించగా, ఆ పంటలలో విలువ జోడిత పదార్థాలు వాణిజ్య కరణపై విస్తృత పరిశోధనలు జరపాలని సమావేశంలో చర్చలు జరిగాయి. శాస్త్రవేత్తలు తమ తమ పరిశోధనా ఫలితాలను వెల్లడించారు.

నేడు రత్నగిరిపై డయల్ యువర్ ఈఓ

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో సోమవారం ‘డయల్ యువర్ ఈఓ’ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం గత ఐదేళ్లుగా ప్రతీ నెల చివరి సోమవారం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. వివిధ కారణాలతో గత మూడు నెలలుగా ఈ కార్యక్రమం నిర్వహించలేదు. మళ్లీ ఈ నెల నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం 10–30 నుంచి 11–30 వరకు భక్తులు 08868–238127 నంబర్‌కు ఫోన్ చేసి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రమేష్‌బాబుకు తమ విలువైన సలహాలు, సూచనలతో బాటు ఫిర్యాదులు తెలియ చేయవచ్చునని తెలిపారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

ముమ్మిడివరం: ఇద్దరు వ్యక్తుల మధ్య చోటుచేసుకున్న వివాదం రెండు వర్గాల మధ్య ఘర్షణకు దారి తీయడంతో ఏడుగురికి గా యాలయ్యాయి. పోలీసులు తెలి పిన వివరాల ప్రకారం శనివారం రాత్రి జరిగిన వివాదంలో ముమ్మిడివరం మార్కెట్ ప్రాంతానికి చెందిన పిసినే రాజుపై దోనిపాటి సముద్రం బీరు బాటిల్‌తో దాడి చేసి గాయపరిచాడు.

దీంతో సముద్రం వర్గీయులను రాజు వర్గీయులు నిలదీయగా ఘర్షణకు దారి తీసి ఏడుగురు గాయాలపాలయ్యారు. సముద్రంతో పాటు మరో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.